క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప తిరువీధి ఉత్సవం



తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కంపోస్టు కాలనీలో అయ్యప్పస్వామి సన్నిధానం ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కేరళ పంచ వాయిద్యాలు, కథాకళి నృత్యాలు, కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ట్రస్టు అధ్యక్షుడు బరాటం సంతోష్, కార్యదర్శి ప్రశాంతల ఆధ్వర్యంలో జరిగిన పూర్ణపుష్కలాంబ సమేత హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి మహాతిరువీధిలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

13న ఉచిత నేత్రవైద్య శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: రోటరీక్లబ్ శ్రీకాకుళం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త నిర్వహణలో ఈ నెల 13న ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వై.గీతా శ్రీకాంత్, అన్నెపు అనంతరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాతబస్టాండు వద్ద ఎన్‌జీవో హోమ్ ఆవరణలో జరిగే శిబిరంలో అనుభవజ్ఞులైన నేత్ర వైద్య నిపుణులచే తనిఖీలు నిర్వహించి, అవసరమైనవారికి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అధునాతన ఐఓఎల్ శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మహిళా శక్తి ఎంతో గొప్పది



ప్రసంగిస్తున్న ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి

శ్రీకాకుళం కల్చరల్: మహిళా శక్తి ఎంతో గొప్పదని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సి.అనంతలక్ష్మి అన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో శనివారం నారీశక్తి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో చైతన్య కలిగించడం ద్వారా భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను పరిరక్షించగలమన్నారు. పురాణ కాలం నుంచి మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంయుక్త, పద్మజ, సంతోషిని, ఇప్పిలి భవానీ, పి.శారద, మోహిని, పద్మలత, పావని తదితరులు పాల్గొన్నారు.

ఉమారుద్ర కోటేశ్వరాలయ ఈఓగా సుకన్య



బాధ్యతలు స్వీకరిస్తున్న సుకన్య

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం గ్రూపు దేవాలయాల ఈఓగా ఎం.సుకన్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఈవో రాధాకృష్ణ పూర్తి చార్జి అప్పగించారు. సుకన్య ఏపీపీఎస్సీ గ్రూప్ సర్వీసు ద్వారా నేరుగా నియమితులయ్యారు.

రక్తహీనత అధిగమించాలి



మాట్లాడుతున్న వెలుగు సిబ్బంది

ఎచ్చెర్ల : మహిళలు రక్తహీనత అధిగమించేందుకు జాగ్రత్తలు పాటించాలని వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త రవి సూచించారు. శనివారం చిలకపాలెం, అల్లినగరం గ్రామాల్లో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోందని, తగిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు ధనలక్ష్మి, రామమూర్తి, సీసీ సత్యవతి, వీఓఏలు యశోద, వినీలా, చిన్నమ్మడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



జగన్నాథం కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: మండలంలోని నెలివాడ గ్రామంలో వీఆర్వో ఎందువ జగన్నాథం తండ్రి అప్పలనాయుడు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. కోటపాలెం పంచాయతీ సర్పంచ్ గొర్లె జగదీష్‌నాయుడు, నాయకులు పిన్నింటి సత్యంనాయుడు, గొర్లె అప్పలనాయుడు, సీతంనాయుడు, అదపాక శ్రీరాములు పాల్గొన్నారు.

డేటా.. అప్‌డేట్‌గా..!

- ప్రజాపంపిణీ వ్యవస్థలో కీలకంగా టైపిస్టు/కంప్యూటర్ ఆపరేటర్లు
- రైస్‌కార్డులు, కుల ధ్రువపత్రాల జారీలో కీలకం
- కచ్చితమైన జాబితాల తయారీలో నిమగ్నం
- ఎప్పటికప్పుడు డేటా అప్‌డేట్ చేస్తూ సేవలు



శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో డేటా ఎంట్రీ పనులు చేస్తున్న ఆపరేటర్లు

శ్రీకాకుళం రూరల్: ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా నిత్యావసర సరకుల పంపిణీ, రైస్‌కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు.. ఇలా ఏ ప్రభుత్వ కార్యక్రమమైనా టైపిస్ట్/కంప్యూటర్ ఆపరేటర్ల సేవలు కీలకంగా మారుతున్నాయి. జిల్లాలో సుమారు 70 మంది ఆపరేటర్లు తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల్లో సేవలందిస్తున్నారు. సర్టిఫికెట్లు, రైస్‌కార్డులు, రేషన్ సంబంధిత వ్యవహారాలతో పాటు భూములు, రీసర్వేలు, పేదలందరికీ ఇల్లు అందించిన జాబితాలను సిద్ధం చేయడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు. తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తుల సమయంలోనూ కచ్చితమైన డేటా కోసం వీరి సేవలు ఉపయోగపడుతున్నాయి. శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయానికి అనుబంధంగా శ్రీకాకుళం రూరల్, నగరం కలుపుకొని సుమారు 2,20,000 మంది జనాభా ఉన్నారు. వీరికి సంబంధించిన డేటాను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడంలో ఆపరేటర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్త కార్డులు, స్ప్లిట్టింగ్ కార్డులు, సాంకేతిక సమస్యలు, భూ సమస్యల పరిష్కారం, కులధ్రువీకరణ పత్రాలు నిర్దేశించిన సమయానికి అందించడంలో వీరు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం తహశీల్దార్ కార్యాలయంలో విభాగాల వారీగా ఒక్కొక్క వ్యక్తిపై పని భారం పడుతున్నా ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల సేవలను పౌరసేవ పత్రంలో ఇవ్వాల్సిన కాలపరిమితిలోపు పరిష్కరించడంలో ఆపరేటర్ సేవలు కీలకంగా ఉన్నాయి. లబ్ధిదారుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాకుండా ప్రభుత్వం, అధికారుల మధ్య అనుసంధానకర్తలుగా టైపిస్ట్, ఆపరేటర్ల సేవల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించడంలోనూ వారి డేటాను క్రోడీకరించడంలో ఆపరేటర్లు ముందంజలో ఉంటున్నారు. నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించి ఎండీయూ వాహనాల ద్వారా చౌకధరల దుకాణ డీలర్లను సమన్వయం పరిచడంలో ఆపరేటర్ల పాత్ర కీలకంగా మారుతోంది.

మా సేవలను గుర్తించారు..



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక టైపిస్ట్, ఆపరేటర్లను ప్రభుత్వం గుర్తించింది. గతంలో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. ప్రస్తుతం రెగ్యులర్‌గా మా బ్యాంకు ఖాతాల్లో జీతాలు పడుతున్నాయి. ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– వి.భాస్కర్, జిల్లా రెవెన్యూ, టైపిస్ట్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు

ప్రత్యేక కార్పొరేషన్



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మాకు కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. నిత్యం ప్రజలతో మమేకమై ఉంటాం. రేషన్ కార్డు నుంచి కులధ్రువీకరణ పత్రం వరకూ ఉన్నతాధికారుల ఆదేశాలకు లోబడి అన్ని పత్రాలను నిర్దేశించిన సమయానికి అందించడంలో మావంతు పాత్ర పోషిస్తున్నాం.

– టి.రామకృష్ణ, ఔట్‌సోర్సింగ్ రెవెన్యూ టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్

ప్రజలతో మమేకం



ప్రజాపంపిణీ వ్యవస్థలో నిత్యావసర సరుకులకు సంబంధించిన డేటాను ప్రతినెలా అప్‌డేట్ చేస్తుంటాం. రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యలతో ప్రజలు వచ్చినప్పుడు పరిష్కారానికి మావంతు సాయం చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాలు, సచివాలయాలను సమన్వయం చేస్తూ కంప్యూటర్‌లో డేటా పొందుపరుస్తాం.

– సిద్ధు, జిల్లా టైపిస్ట్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం కార్యదర్శి

జగనన్న కాలనీల పూర్తికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గొండు రఘురామ్

గార: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న కాలనీల నిర్మాణం పూర్తయ్యేలా అందరూ సహకరించాలని ఎంపీపీ గొండు రఘురామ్ కోరారు. శనివారం గార మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా 2024–25 మండల పరిషత్ వార్షిక బడ్జెట్ అంచనాలను ఆమోదించారు. జగనన్న లేఅవుట్లో మూడన్నరేళ్లుగా ఇళ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు తహశీల్దార్లు నోటీసులు ఇవ్వాలని, వారి స్థానంలో కొత్త లబ్ధిదారులుకు అవకాశం ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయని చెప్పారు. జనవరి 31 నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. 300 హెక్టార్లలో వరి పంట వర్షానికి తడిచినట్టు ప్రాథమికంగా గుర్తించామని వ్యవసాయాధికారి డి.పద్మావతి తెలిపారు. రంగు మారడం, నూక, తేమపై ప్రభుత్వం నుంచి సోమవారం నాటికి ఆదేశాలు వచ్చే అవకాశముందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, మండల ప్రత్యేకాధికారి బి.వెంకటరమణ, ఎంపీడీఓ సంజీవి రమణయ్య, డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్‌జీవీవీ ప్రసాదరావు, అంధవరపు బాలకృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, పీస గోపి, కొయ్యాన నాగభూషణం, పీస శ్రీహరిరావు, మార్పు రమణమూర్తి, గంగు రామారావు, పొదిలాపు రామజోగి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులతోనే మనుగడ



మాట్లాడుతున్న పొన్నాడ రవికుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: మానవాళి మనుగడకు మానవ హక్కులే మూలమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, నేషనల్ చీఫ్ సెక్రటరీ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డాక్టర్ బాడాన దేవభూషణరావు, కార్యదర్శి రాంగోపాల్, కామేష్, లెక్చరర్లు కిల్లి అప్పారావు, హేమసుందరరావు పాల్గొన్నారు.

ఆదిశంకరుని స్తోత్ర వైభవం ప్రారంభం



శంకరాచార్యుల చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో గుజరాతిపేట రాజరాజేశ్వరీ త్రిపుర సుందరీ దేవీ పీఠం, ఉపనిషన్మందిరం సంయుక్త నిర్వహణలో మూడురోజుల పాటు నిర్వహించనున్న ఆదిగురువు శంకరాచార్య స్తోత్ర వైభవ ప్రసంగం శనివారం ప్రారంభమైంది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పాలర్ల పాటి శ్రీనివాస బంగారయ్యశర్మ ప్రసంగిస్తూ శంకరాచార్యుల వైభవాన్ని వివరించారు. అంతకుముందు సామూహిక లలితాసహస్రనామ పారాయణ, శివస్తోత్ర పఠనం, కోదండ రామాలయం నుంచి శంకరాచార్యుని చిత్రపటంతో ఊరేగింపు, కోలాట ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షులు గుమ్మా నగేష్, పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ, కార్తికేయశర్మ, సుసరాపు దుర్గాప్రసాద్, పొట్నూరి వెంకటరావు పాల్గొన్నారు.



సామూహిక పారాయణ చేస్తున్న మహిళలు

ప్రత్యేకావసరాల పిల్లలకు ట్యాబ్‌లు



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న రొక్కం బాలకృష్ణ

ఎచ్చెర్ల/లావేరు: ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్యాబ్‌ల ద్వారా విద్యా బోధన చేయాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ సూచించారు. లావేరు భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇటీవల జిల్లా, మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. దివ్యాంగులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీలు సత్యవతి, ఇ.మాధురి, భోజరాజు పాల్గొన్నారు.


ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం కల్చరల్: వృద్ధులు, మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వక్తలు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోషియేషన్ శ్రీకాకుళం శాఖ నిర్వహణలో శనివారం కిన్నెర థియేటర్ ఎదురుగా ఉన్న జెమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజెన్సులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ జష్మంతి, డాక్టర్ సాయివివేక్, డాక్టర్ ఐశ్వర్య ఆరోగ్యపరమైన సలహాలు అందించారు. కార్యక్రమంలో జెమ్స్ సిబ్బంది శివప్రసాద్, రవిబాబు, మహేష్, ట్రైనీ డాక్టర్స్ వంశీ, లాస్య, రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి పి.నరసింహమూర్తి, సిటీ బ్రాంచి అధ్యక్షుడు కె.సోమసుందరరావు, కార్యదర్శి పి.ఎస్.ప్రసాదరావు, సభ్యులు జానకీరామ్, కోటేశ్వరరావు, గణపతి ఆచారి, సవరయ్య, పోలయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



లైబ్రరీకి అందజేసిన పుస్తకాలు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో ఇడదాసుల విద్యా ఆరోగ్య సేవా ఫౌండేషన్ గ్రంథాలయానికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ శనివారం రూ.15వేలు విలువైన పుస్తకాలను వితరణగా అందజేశారు. ఏపీపీఎస్సీ, గ్రూప్స్ వంటి పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు వీలుగా వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు వెంకట సత్యనారాయణ, అధ్యక్షుడు ఇ.తిరుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ పథకాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పథకాలన్నీ అమలు చేస్తున్నట్లు ఎంపీపీ మొదలవలస చిరంజీవి తెలిపారు. కొత్తపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకుంటామన్నారు. అనంతరం గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మండల అడ్వయిజర్ బోర్డు చైర్మన్ బొడ్డేపల్లి సుధాకర్, సర్పంచ్ గజలక్ష్మీ, ఎంపీటీసీ గురుగుబిల్లి నరసింహమూర్తి పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, కాలానుగుణంగా మారుతున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రేగా సూర్యారావు అన్నారు. శనివారం బార్ కార్యాలయంలో నూతన న్యాయవాదులుకు, ఏఐబీఈ (ఆల్‌ఇండియా బార్ ఎగ్జామినేషన్)కు వెళ్తున్న అభ్యర్థులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

జి.సిగడాం: మండల కేంద్రంలో జి.సిగడాం జెడ్పీ హైస్కూల్లో శనివారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో ఎందువ హైస్కూల్ విద్యార్థులు, జూనియర్ విభాగంలో పెంట యూపీ స్కూల్ విద్యార్థులు విజేతగా నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూర్మినాయుడు, కుప్పిలి రవికుమార్ పట్నాయక్, తారకేశ్వరరావు, రామినాయుడు, భారతి, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు



కొనుగోలు చేసిన ధాన్యం వాహనం వద్ద ఎంపీపీ రఘురాం, ప్రజాప్రతినిధులు, అధికారులు

గార: రైతుల వద్ద ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శనివారం రామచంద్రాపురం పంచాయతీలోని రైతు భరోసా కేంద్రం వద్ద జీఈసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 13 ధాన్యం కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆర్బీకేల్లో ధాన్యం నాణ్యత పరీక్షలు చేశాక కల్లం వద్దే లోడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు మిల్లర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, జీపీఎస్ ఆధారంగా వాహనాల పరిస్థితిని అధికారులు తెలుసుకుంటారని చెప్పారు. ఆర్బీకే స్థాయిలో ఎఫ్‌ఓటీ తయారు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మూకాళ్ల తాతబాబు, పీస గోపి, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, గొలివి కొండలరావు, అంబటి చినబాబు, శీర సత్యం, వైస్ ఎంపీపీ అంధవరపు బాలకృష్ణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, యాళ్ల నారాయణమూర్తి, ముద్దాడ గోవిందరావు, శిమ్మ ధర్మరాజు, ఏవో దుంపల పద్మావతి, గొలివి గోవిందరావు, జీఈసీఎస్ బీఎం లక్ష్మణరావు, ఏ.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనండి



ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా కిట్లు

ఎచ్చెర్ల క్యాంపస్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ సూచించారు. వర్సిటీ ప్రిన్సిపాళ్లు, అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖరరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మండల పరిషత్ కార్యాలయానికి శనివారం ఆడుదాం ఆంధ్రా క్రీడా కిట్లు చేరుకున్నాయి. క్రికెట్, వాలీ బాల్ కిట్లు సచివాయాలు వారీగా అందజేయనున్నారు. మండలంలో 28 గ్రామ సచివాలయాలు ఉండగా, తోటపాలెం, కుశాలపురం గ్రామ సచివాలయాలు శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో ఉన్నాయి. మిగతా 26 గ్రామ సచివాలయాలకు కిట్లు అందజేయ నున్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా



శ్రీకాకుళం రూరల్: పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకట్రావు



జి.సిగడాం: ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఎన్నికల అధికారి వేణుగోపాలరావు

జి.సిగడాం: గ్రామస్థాయిలో నియమించిన బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓ) సమర్థంగా విధులు నిర్వహించి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనిమండల అసిస్టెంట్ రిట్నరింగ్ అధికారి పప్పల వేణుగోపాలరావు సూచించారు. శనివారం ఆనందపురం, వాండ్రంగి, ధవళపేట, సంతవురిటి, పాలఖండ్యాం, జగన్నాథపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల నమోదును పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంకిత భావంతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, బూత్ లెవల్ అధికారులు వడగా గౌరీ, పైల జయరాం, హిమబిందు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓట్లు నమోదు

శ్రీకాకుళం రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని శనివారం మండల వ్యాప్తంగా నిర్వహించారు. రాగోలు, బైరివానిపేట, బలగ స్కూల్ పరిసర ప్రాంతంలో పోలింగ్ బూత్‌లను తహశీల్దార్ ఎస్.వెంకట్రావు పరిశీలించారు. ఫారం–6,7,8లు ఏయే బూత్‌లో ఎన్నెన్ని వచ్చాయో బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా మహాకుంభాభిషేక మహోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్త దంపతులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కొన్నావీధిలోని రాజరాజేశ్వరి సహిత భీమేశ్వరస్వామి దేవాలయంలో సహస్ర కలశ స్నపన మహా కుంభాభిషేక త్రయాహ్నిక దీక్షా మహోత్సవం ఘనంగా శనివారం ప్రారంభమైంది. భీమేశ్వరాలయ జీర్ణోద్ధరణలో భాగంగా అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు, ధర్మపురి గౌరీశంకరశాస్త్రి, వేదపండితుల పర్యవేక్షణలో దంపతులచే సామూహిక సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, సహస్ర కలశ ఆవాహన తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఋత్విక్కులు, దంపతులు, నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వేదికపై కుంభాభిషేక పూజలు

వెంకన్నకు ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో కార్తీక శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించి, పూజలు చేశారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు.

జగద్గురు పీఠంలో గురుపూజ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జగద్గురు పీఠం ఆధ్వర్యంలో మాస్టర్ సి.వి.వి.గురుపూజా మహోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. విజయనగరానికి చెందిన యు.వి.ఎస్.రాజు మాట్లాడుతూ మాస్టర్ సి.వి.వి.జీవిత చరిత్రను వివరించారు. అంతకుముందు మహాగణపతి పూజ, ప్రార్థన నిర్వహించారు.